క్లుప్తంగా

బీఆర్‌ఎస్ కార్యాలయంలో కవిత ఫ్లెక్సీ తొలగింపు



ఫ్లెక్సీ తొలగిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి: బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేసిన వెంటనే ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి తొలగించారు. చాలాకాలంగా కార్యాలయం లోపల కవిత ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పార్టీలో జరిగిన పరిణామాలతో ఆమెను కేసీఆర్ మంగళవారం సస్పెండ్ చేశారు. ఆ వెంటనే పై నుంచి వచ్చిన ఆదేశాలతో ఫ్లెక్సీని తొలగిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జగిత్యాల: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కో–కన్వీనర్ చందు అన్నారు. మంగళవారం జగిత్యాలలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 19 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రిషి, అనిల్, సురేశ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పెగడపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర పేర్కొన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పల్లల ఎదుగుదల, శారీరక, మానసిక వికాసం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో కూలిన ఇల్లు



వర్షానికి కూలిన ఇల్లు

మల్లాపూర్: మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగ్యారపు శ్రీనివాస్‌కి చెందిన పెంకుటిల్లు మంగళవారం కూలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో సంఘటన స్థలానికి వెళ్లి కూలిన ఇల్లును పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. శ్రీనివాస్‌ను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రొసీడింగ్స్ పత్రాలు పంపిణీ



ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న నాయకులు

మల్యాల: మండలంలోని నూకపల్లిలో వివిధ కుల సంఘాలకు రూ.20 లక్షల విలువైన ప్రొసీడింగ్ పత్రాలను మల్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిస్త్రీ శ్రీనివాస్, నులుగొండ సురేశ్, కనకట్ల జలందర్, మారంపల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

జగిత్యాల/జగిత్యాలజోన్/రాయికల్/కోరుట్ల టౌన్/బుగ్గారం/కథలాపూర్: జిల్లా కేంద్రంలోని వెంకటాద్రినగర్‌లోని గణేశ్ మండపంలో కాలనీ మహిళలు దీపాలంకరణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి సోమవారం సహస్త్ర దీపాలంకరణ చేశారు. కోరుట్ల పట్టణంలోని శ్రీరేణుకా దేవాలయం వద్ద గౌడ సంఘం ఉత్సవ కమిటీ గణపతి వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదర్శనగర్ కాలనీలో శ్రీఅష్టలక్ష్మీ ఆలయ ప్రాంగణంలో గణపతి మండపం వద్ద గణపతి హోమం మంగళవారం నిర్వహించారు. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని గుడేటి సంఘం, రాయికల్‌లో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి మంగళవారం 108 రకాల నైవేద్యాలు సమర్పించి, అన్నదానం చేశారు. బుగ్గారం మండలంలోని పలుచోట్ల కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో వినాయక మండపాల వద్ద మంగళవారం పూజలు, అన్నదానం చేశారు. కథలాపూర్‌లో యంగ్‌స్టార్స్ యూత్ వినాయకుడి వద్ద 25 హోమం గుండాలతో మంగళవారం రుద్ర హోమం నిర్వహించారు.



కోరుట్లలో కుంకుమపూజలో మహిళలు



జగిత్యాలలో మహిళల ఆటాపాట



సారంగాపూర్‌లో జీవన్‌రెడ్డి పూజలు





బుగ్గారంలో కుంకుమపూజలో మహిళలు



కథలాపూర్‌లో హోమం చేస్తున్న దంపతులు



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు



కథలాపూర్‌లో విప్, నాయకుల నివాళి



ఇబ్రహీంపట్నంలో నివాళి అర్పిస్తున్న నాయకులు



సారంగాపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



మల్లాపూర్‌లో నాయకుల నివాళి



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వైఎస్సార్‌కు ఘన నివాళి

జగిత్యాలరూరల్/కోరుట్ల/మెట్‌పల్లి/మల్లాపూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడిరాష్ట్ర సీఎంగా వైఎస్ఆర్ నిరుపేద, దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్రను సంపాదించుకున్నారని కొనియాడారు.



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన

మెట్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరడాన్ని నిరసిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు.

సీబీఐ విచారణకు కాంగ్రెస్, బీజేపీలే కుట్ర

ఇబ్రహీంపట్నం: కాళేశ్వరం కమిషన్‌పై సీబీఐ విచారణకు ఆదేశించడం వెనుక కాంగ్రెస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల ధశరత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి: కాళేశ్వరం ప్రాజెక్ట్ పీసీఘోష్ కమిషన్ రిపోర్టుపై మండల బీఆర్‌ఎస్ నాయకులు జాతీయ రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ మకిలీ దాసు, మేడిపల్లి మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు క్యాతం సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: కాళేశ్వరం ప్రాజెక్టు సీబీఐ విచారణ పేరుతో కాలయాపన చేస్తూ రైతులకు నీరందించకుండా పోతున్నారని బీఆర్‌ఎస్ నాయకులు డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురిలోని అంబేడ్కర్ కూడలి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, నాయకులు అయ్యోరి రాజేష్ ఆకుల రాజేష్, సంగి శేఖర్ తదితరులున్నారు.



మెట్‌పల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బుగ్గారం: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని బుగ్గారం మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గాలిపెల్లి మహేశ్, మూల శ్రీనివాస్‌గౌడ్, కట్ట రాజేందర్, దసర్తి పూర్ణచందర్, పొన్నం సత్తయ్య గౌడ్, అబ్దుల్ రహమాన్, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ కార్యక్రమాలు ప్రతీ మహిళకు చేరాలి

జగిత్యాలజోన్: సెర్ప్ అమలు చేస్తున్న ప్రతీ కార్యక్రమం జిల్లాలోని ప్రతి మహిళకు అందాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్, బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, ఫామ్, నాన్ ఫామ్, సంస్థాగత నిర్మాణంలో సెర్ప్ సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం అప్పగించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు రమేష్, నారాయణ, నాగేశ్వర్ రావు, స్త్రీనిధి ఆర్ఎం. నారాయణ, జిల్లా ఏపీఎంలు శ్రీనివాస్, చక్రవర్తి, గంగాధర్, హుస్సేన్, సీసీలు, ఎంఎస్సీలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

జగిత్యాలటౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సమాజంలోని ప్రతీ వ్యక్తి తనవంతుగా మొక్కలు నాటాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ కోరారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణ వివేకానంద మినీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన వనమహోత్సవానికి రఘువరన్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా యువజన,క్రీడల అధికారి రవికుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి పద్మారావు, మహేష్, బాక్సింగ్ కోచ్ నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రఘువరన్ విద్యార్థులు

బాలుడి మృతి బాధాకరం

సారంగాపూర్: కుక్క కాటుకు బాలుడి మృతిచెందడం బాధాకరమని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల క్రితం తుంగూర్ గ్రామానికి చెందిన ఇంద్రాల రక్షిత (3) బాలుడు కుక్క కరవడంతో రేబిస్‌తో మృతిచెందాడు. మాజీ మంత్రి రక్షిత్ తల్లితండ్రులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, నాయకులు ఉన్నారు.

వినాయక మండపాల్లో జీవన్‌రెడ్డి పూజలు

మండల కేంద్రంతో పాటు, బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలోని వినాయక మండపాల్లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మంగళవారం పూజలు నిర్వహించారు. మండప నిర్వాహకులు జీవన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు

కోరుట్ల రూరల్: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఏఎల్ఐఎంసీవో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని కోరుట్ల, కథలాపూర్, మేడిపెల్లి,భీమారం,రాయికల్ ,మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల దివ్యాంగ విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు శ్రూష కాంబ్లీ, తుషార్ ద్వేవది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం,మున్సిపల్ కమిషనర్ రవీందర్, జిల్లా సర్వ శిక్షా కమ్యూనిటీ కోఆర్డినేటర్ కే.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్కానర్, ప్రింటర్ అందజేత

సారంగాపూర్: మండలంలోని నాగునూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన చిట్నేని కార్తీక్‌రావు తన తండ్రి చిట్నేని ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం పాఠశాలకు రూ. 26 వేలు విలువ చేసే ప్రింటర్, స్కానర్‌ను అందజేశారు. తల్లి సుజాత చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గౌస్ పాషా, నాయకులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం

మెట్‌పల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ అక్రమంగా ఓట్లను దొంగతనం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి మోదీ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యామ రాజయ్య, నాయిని సురేష్, పన్నాల మాధవరెడ్డి, షేక్ మహమ్మద్ తదితరులున్నారు.



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తుది ఓటరు జాబితా ప్రదర్శన

కోరుట్ల రూరల్: మండలంలోని 15 గ్రామాల్లోని గ్రామపంచాయితీ నోటీసు బోర్డులు, మండల పరిషత్ కార్యాలయ బోర్డుపై తుది ఓటర్ జాబితాను మంగళవారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల తుది ఓటర్ల విడుదల చేస్తున్నట్లు ఏంపీడీవో స్వరూప రెడ్డి తెలిపారు.

మల్యాల: స్థానిక సంస్థల ఎన్నికల కోసం రూపొందించిన ఓటర్ తుది జాబితాను ఎంపీడీవో స్వాతి ప్రదర్శించారు. మండలంలోని 19 గ్రామాలకు సంబంధించిన అభ్యంతరాలను సవరించి, స్థానిక సంస్థల కోసం తుది ఓటరు జాబితా రూపొందించి, మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు.



కోరుట్లలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల ఓటర్ల తుది జాబితాను మంగళవారం అందుబాటులో ఉంచారు. కార్యక్రమాల్లో సారంగాపూర్ ఎంపీడీవో గంగాధర్, బీర్‌పూర్ ఎంపీడీవో భీమేశ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అమ్మ పేరున మొక్కలు నాటుదాం

రాయికల్: మండలంలోని 32 గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమ్మ పేరున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఎంఈవో రాఘవులు, ఎంపీవో సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వనమహోత్సవంలో భాగంగా మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మ పేరున మొక్కలను నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజన్న, ఏపీవో కోమరయ్య, టీఏ వినోద్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ అన్న నినాదంతో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెగడపల్లి: నాటిన ప్రతి మొక్కను బతికించాలని ఎంపీడీవో శ్రీనివాస్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు. అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందగిరి తెనుగువాడ, మోడల్ స్కూల్లో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

కొడిమ్యాల: ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరు మీద విద్యార్థులు ఒక మొక్క నాటాలని ఎంపీడీవో స్వరూప అన్నారు. మండలంలోని నమిలికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, టీఏ భువన్, స్కూల్ స్టాఫ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

- **కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత**

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ఉమ్మడి మేడిపల్లి మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించి వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మాజీ సర్పంచ్ బొంగోని రాజగౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

- **క్రికెట్లో అదరగొడుతున్న యువతేజం**

కొడిమ్యాల: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొయినాబాద్ లోని వన్ ఛాంపియన్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న టు డేస్ లీగ్ మ్యాచ్ కొడిమ్యాల జూనియర్ కళాశాల విద్యార్థి ఎర్రోజు తక్షిల్ 125 బంతుల్లో 156 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. ఈసందర్భంగా తక్షిల్ ను ప్రిన్సిపాల్ వేణు, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

- **ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు**

సారంగాపూర్: ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలు ఈ నెల 9,10,11 మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు బీర్‌పూర్ ఎంఈవో సిరుప నాగభూషణం తెలిపారు. మంగళవారం బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడల ఏర్పాట్లపై మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఫిజికల్‌డైరెక్టర్లు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే 9న అండర్ –14,17 బాలికల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. 10 న బాల, బాలికలకు అథ్లెటిక్స్ క్రీడలు ఉంటాయన్నారు. 11న అండర్ –14,17 బాలురకు కోకో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు జరుగుతాయన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

- **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ**

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో మంగళవారం లబ్ధిదారుడికి మంజూరైన రూ.50 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, నాయకులు కొమ్ముల చిన్నారెడ్డి, మామిడి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- **ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో తనిఖీ**

రాయికల్: మండలంలోని మైతాపూర్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఎంపీడీవో చిరంజీవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను తనిఖీ చేసి వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగార్జున, ఎంఈవో రాఘవులు ఉన్నారు.

- **తుంగూర్‌లో వైద్యశిబిరం**

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ శిబిరంలో భాగంగా జ్వర, మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ప్రజలు దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుష్మా, ఏఎస్ఎం ఇందిరా, అరుణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- **పసుపు తోటల పరిశీలన**

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల ఉద్యాన శాఖ అధికారుల బృందం మంగళవారం నియోజకవర్గంలోని జగిత్యాల, రాయికల్, మండలాల్లోని మోరపల్లి, ఆలూరు, భూపతిపూర్ గ్రామాల్లో పసుపు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఉద్యాన శాఖ అధికారి కె.స్వాతి మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పసుపు తోటల్లో నీరు నిలిచి ఉంటే వెంటనే తీసివేయాలని, లేకపోతే దుంపకుళ్లు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి వంశీ పాల్గొన్నారు.

- **దరఖాస్తులు ఆహ్వానం**

జగిత్యాల: జిల్లాలో ఎంపికైన 51 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బోధించేందుకు 51 మంది బోధకులు, 51 మంది ఆయాలను నియమించేందుకు స్థానికులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో రాము తెలిపారు. బోధకులుగా బోధించేందుకు ఇంటర్, ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న వారికి గౌరవ వేతనం రూ.8 వేలు, ఆయాలకు రూ.6 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 6 లోపు దరఖాస్తులు ఎంఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

- **అతిథి అధ్యాపకులకు..**

జగిత్యాల: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపకులకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 1 పోస్టు ఉందని, సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

- **గిరిజన యువతకు శిక్షణ**

జగిత్యాల: గిరిజన యువతీ, యువకులకు సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరులో గిరిజన పరిశోధన సమాచారం విద్య కమ్యునికేషన్ ఈవెంట్స్ సెమి కండక్టర్ ప్రాబికేషన్ అండ్ క్యారక్టరైజేషన్ శిక్షణ కార్యక్రమం నందు గిరిజన యువతీ, యువకులకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

- **రాయితీపై వ్యవసాయ పనిముట్లు**

కోరుట్ల రూరల్: సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానైజేషన్ (ఎస్ఎంఏఎం) కింద మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తామని మండల వ్యవసాయ అధికారి నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్ల మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్ 185, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్స్ 30, రోటవేటర్స్ 10, కల్టివేటర్స్ 13, పవర్ వీడర్1, పవర్ టిల్లర్ 1, బండ్ ఫార్మర్ 1, సీడ్ కం ఫర్టిలైజర్స్ డ్రీల్ 3, బ్రష్ కట్టర్ 2, స్ట్రా బేలర్ 1, మంజూరయ్యాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఆయా గ్రామాల క్లస్టర్ రైతు వేదికల్లో ఏఈవో వద్ద దరఖాస్తులు సమర్పించాలని ఏవో పేర్కొన్నారు.